నేటి ధర్నాకు లబ్ధిదారులు తరలిరావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదిన ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు గుంటూరు మల్లయ్యలింగం భవన్ నుంచి వీడియో సందేశాన్ని ఆదివారం విడుదల చేశారు. టిడ్కో గృహాలను లబ్ధి దారులకు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న రూ.1,80 లక్షలను రూ.5 లక్షలకు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని గుంటూరు, తాడికొండ, ప్రత్తిపాడు, మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల నుంచి లబ్ధిదారులు కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నా అనంతరం సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేస్తారని తెలిపారు.

11న కలేకూరి, మద్దూరి, పైడిల సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 11 శనివారం సాయంత్రం 5గంటలకు స్థానిక బ్రాడీపేట లోని సీపీఎం కార్యాల యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్‌బాబు, పైడి నరేష్ బాబు- దళిత బహుజన తత్వం'అనే అంశంపై సభ జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలో ఉన్న మద్రాస్ కాఫీ హోటల్ సెంటర్‌లో డొక్కా మాణిక్యవర ప్రసాద్ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ధిక్కార కవులుగా కలేకూరి ప్రసాద్, మద్దూరు నగేష్ బాబు, పైడి నరేష్ బాబు నిలిచిపోతారన్నారు. కలేకూరి ప్రసాద్, మద్దూరి నగేష్ బాబు, పైడి నరేష్‌బాబు దళిత అస్తిత్వాన్ని తెలుగు సాహిత్యంలో బలంగా వినిపించారని గుర్తు చేశారు. విరసం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ముగ్గురు కవులు దళిత సాహిత్యాన్ని ప్రధాన స్రవంతి సాహిత్యానికి అను సంధానం చేశారని తెలిపారు. కవులు ఎఫ్ఎం సుభాని, చంద్రపాల్, శ్యాంబాబు, కడియం జేమ్స్, బందారు సురేష్ బాబు, హైకోర్టు సీనియర్ న్యాయవాది సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆశా సజినీకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : ఇటీవల గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేప ట్టిన ఆశా సజినీని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జీజీహెచ్ బ్రాంచి అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు ఆధ్వ ర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జీజీహెచ్ ప్రాంగణంలోని ఛాంబర్‌లో ఆశా సజినీని కలిసి పుష్పగుచ్ఛంతో, శాలువాతో ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లా యిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డె బాలయ్య, నాగరాజు, కుమార్ రాజా, కోటేశ్వరరావు, షేక్.మస్తాన్‌బీ, జ్యోత్స్న, భూలక్ష్మీదేవి, రమణ, సీహెచ్. మంగమ్మ, జయమ్మ, దాసరి లక్ష్మి తదితరులు ఉన్నారు.

నారా లోకేష్ క్రీడా ప్రాంగణం ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొండపనేని టవర్స్ పక్కనే భోగి ఎస్టేట్స్‌లో క్రికెట్ ప్రాక్టీస్ నెట్, క్రికెట్ గ్రౌండ్, షటిల్, వాలీబాల్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నారా లోకేష్ సహ కారంతో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. టీడీపీ నాయకులు నందం అబద్ధయ్య రిబ్బన్ కట్ చేసి క్రీడా ప్రాంగ ణంను ప్రారంభించారు. నియోజకవర్గ యువకులు, క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే నారా లోకేష్ లక్ష్యంగా, క్రీడాప్రాంగణం ప్రారంభించామన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు గ్రౌండ్‌ను వినియో గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, మండల పార్టీ అధ్యక్షులు తోట పార్థసారథి, తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, తాడేపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షులు కేసంనేని శ్రీ అనిత, టీడీపీ నాయకులు దానబోయిన సుందర్రావు యాదవ్, గుత్తికొండ ధనంజయరావు, దొప్పలపూడి జ్యోతి బసు, జవ్వాది కిరణ్ చంద్, పడవల మహేష్, భోగి వినోద్ పాల్గొన్నారు.

నేడు జీఎంసీ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సోమవారం ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం జీఎంసి కాన్ఫరెన్స్ హాల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై కమిషనర్‌కి అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు.

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు : చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల విద్యార్థులు అంతరిక్ష విశేషాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పలు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యల్లా శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం గర్వించదగిన శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు అంతరిక్ష విజ్ఞానంపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సకాలంలో జీతాలు చెల్లించకపోవడం అన్యాయం: ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ నెల 5వ తేదీ ఆదివారం రోజు వరకు కూడా జనవరి జీతాలు చెల్లించక పోవడం అన్యాయమని, అత్యంత దుర్మార్గమైన చర్యని ఎస్టీయూ రాష్ట్ర పూర్వపు అధ్యక్షులు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు విమర్శించారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన ఎస్టీయూ ముఖ్య నాయకులు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుధీర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాలు, పింఛన్లు చెల్లిస్తున్న విధానం సక్రమంగా లేదని, ప్రతినెల జీతాల కోసం పింఛన్ల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఇటువంటి పరిస్థితులు గతంలో ఏ ప్రభుత్వంలో లేవని తీవ్రంగా విమర్శించారు. ఈ ప్రభుత్వం కక్షపూరితంగానే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నెల, నెల జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీతాల చెల్లింపులో ఈ ప్రభుత్వం ప్రతినెల ఏదో ఒక సాకు చూపి ఒకటవ తేదీన జీతాలు చెల్లించకుండా ఆలస్యం చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను తీవ్రంగా అవమానిస్తున్నదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, సిహెచ్ ఉమా, షేక్ బాజీ, డీఏ జోసెఫ్, పి.శ్రీనివాసరావు, జె.సుబ్బారావు, వై.శ్యాంబాబు, కొరివి అనిల్ కుమార్, ఎంపీ సుబ్బారావు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాఘవయ్య పార్కుపై నిర్లక్ష్యం ఎందుకు: ఆళ్ల హరి

విశాలాంధ్ర-గుంటూరు : పట్టణాన్ని ఆరోగ్య నగర్‌గా మార్చేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నా మంటూ చెబుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరికి రెండు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యా నికి గురై అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన శ్రీనివాసరావుతోటలోని పట్టంశెట్టి చిన రాఘవయ్యపార్కు కనపడకపోవటం శోచనీయమని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య నగర్‌లో శ్రీనివాసరావుతోటకు స్థానం లేదా అని కమిషనర్‌ని ప్రశ్నించారు. దాదాపు నలభై వేల మంది నివసించే ఈ ప్రాంతంపై నాయకు లకు, అధికారులకు ఎందుకు చిన్నచూపో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవయ్య పార్కుని ఆదివారం జనసేన నాయకులు పరిశీలించారు. పార్కు మొత్తం పిచ్చి మొక్కలతో, గడ్డితో పెరిగిపోయిందని, బెంచీలు, ఆట వస్తువులు పూర్తిగా పాడైపోయాయన్నారు. ఇక్కడి మహిళలు నడక కోసం, వ్యాయామం చేయడం కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందన్నారు. ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించాలన్న బాధ్యతను పాలకులు, అధికారులు ఎప్పుడో గాలికివదిలేసారని దుయ్యబట్టారు. పార్కు అభివృద్ధిపై పలుమార్లు సంబంధిత అధికారులను, స్థానిక నేతలను కలిసినా ఎలాంటి ఉపయోగం లేదని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు ఈ పార్కు దుస్థితి గురించి తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కమిషనర్ అయినా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పార్కుని అభివృద్ధి చేయాలని కోరారు. పార్కుని పరిశీలించిన వారిలో సయ్యద్ షర్ఫుద్దీన్, వడ్డె సుబ్బారావు, సయ్యద్ రఫీ, పరిసపోగు రమేష్, యాకోబు, సాయి, సలాం తదితరులున్నారు.

మా గోడును ఆలకించండి..

సుచరితకు దళిత నాయకుల వినతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నిరుపయోగంగా ఉన్న అంబేద్కర్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురా వాలని దళిత సంఘాల విజ్ఞప్తిని ఆలకించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్, దళిత బహుజన ప్రజా సంఘాలు మాజీ హోంమంత్రి మేకతోటి సుచరితను కోరారు. స్థానిక బ్రాడీపేటలోని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా బలంగా లేని దళిత బహుజన ప్రజా సంఘాలు నాయకులు, వివిధ సంఘాల నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఒక్క సభ ప్రాంగణం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో బీఆర్ అంబేద్కర్ భవనాన్ని బహుజనులు ఉపయోగించుకునే విధంగా వాడుకలోకి తేవాలని సుచరితను కోరారు. స్పందించిన సుచరిత తప్పకుండా ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి, వీసీకె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, రజక జనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జుహూడి శ్రీనివాసరావు, దళిత హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాస్, భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, దొడ్డ ప్రసాద్, యరగుట్ల సుజాతరావు, రావినూతల కమల కుమారి, బాజీ తదితరులు ఉన్నారు.

శ్యామలనగర్ అభివృద్ధి ప్రదాత వీవీఆర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శ్యామల నగర్ అభివృద్ధి ప్రదాత విన్న కోట వీర రాఘవరావు మరణం శ్యామల నగర్ వాసులకు తీరని లోటని శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం గుంటూరు శ్యామల నగర్ పార్క్‌లోని బ్యాడ్మింటన్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాఘవరావు సంస్మరణ సభ పల్లెటూరి పట్టణ సంఘం కార్యదర్శి డాక్టర్ పాలేరు పోతురాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 40 యేళ్లుగా రాఘవరావు ఎన్జీఓలకు చేసిన కృషిని కొనియాడారు. శ్యామల నగర్ అభివృద్ధికి, పార్క్ అభ్యున్నతికి నిరంతరం కృషి చేసేవారని చేశారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాఘవరావు రాజకీయాలకతీతంగా అభివృద్దే ధ్యేయంగా కృషి చేశారని, ఎన్జీఓల సమస్యలు పరిష్కారం కోసం శ్యామల నగర్ వాసుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే వారన్నారు. తొలుత విన్న కోట వీర రాఘవరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త సామినేని కోటేశ్వరరావు, వామపక్షవాది బొప్పూడి స్టాలిన్ బాబు, అడ్వకేట్ సురేందర్ రెడ్డి, ఇన్‌కం టాక్స్ అధికారి రామ్ కిషోర్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు తోటకూర శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ నేతలు అమరేంద్ర, శేఖర్ రెడ్డి, నరసింహమూర్తి, మల్లారెడ్డి, కనపర్తి రాఘవ రావు, డాక్టర్ జగదీష్, లింగారెడ్డి, మూర్తి, వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

వైసీపీతో పోరాటం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో మైనార్టీలపట్ల వివక్షను చూపుతున్న వైసీపీతో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్తీ పిలుపునిచ్చారు. ఆవాజ్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం స్థానిక సిఐటీయు జిల్లా ఆఫీస్ కేంద్రంలో ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలపై మతోన్మాద బీజేపీ చేస్తున్న దాడులకు స్పష్టమైన ఆధారమే ఇటీవల విడుదలైన బీబీసీ డాక్యుమెంటరీ అన్నారు. బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, రాందేవ్ బాబా వ్యాఖ్యలు మైనార్టీలను భయాందోళనలకు గురి చేస్తున్నాయన్నారు. బడ్జెట్లో మైనారిటీల కేటాయింపులో 33 శాతం కోత, స్కాలర్షిప్‌ల నిలిపివేత మైనార్టీలను ఆర్థిక పరంగా, విద్యాభివృద్ధిపరంగా అణచి వేస్తుందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బిజెపి ఎజెండానే అమలు చేస్తుందనీ, గతం నుంచి ఉన్న సంక్షేమ పథకాలు నిలుపుదల చేసి కొత్తగా బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు మైనార్టీల కోసం చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తుందనీ, కేంద్రంలో మతోన్మాద బిజెపితో, రాష్ట్రంలో మైనార్టీలపట్ల వివక్షను చూపుతున్న వైసీపీతో పోరాటం చేయాల్సిన అవ సరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. రాబోయే కాలంలో రంజాన్ నెలలో మైనారిటీలకు సేవా, సహాయ కార్యక్రమాలు, మైనార్టీల స్థితిగతులపై సర్వే నిర్వహించి ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవాలని నిర్ణయించారు.

యువశక్తితోనే జగణాసుర పాలన అంతం

విశాలాంధ్ర-గుంటూరు : ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి ఎప్పుడైతే ప్రమాణ స్వీకారం చేశారో ఆ క్షణం నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు త్రిశంఖు స్వర్గంగా మారాయని, చైతన్యం కలిగిన యువత ద్వారానే ఈ జగణాసుర పాలన అంతమవుతుందని జనసేన పార్టీ గుంటూరు అర్బన్ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ అన్నారు. ఆదివారం నగర పార్టీ కార్యాలయంలో నల్లచెరువు ప్రాంతం నుంచి పెద్దఎత్తున యువకులు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ అరాచక పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెల కొందన్నారు. అధికారంలోకి రాకముందు అన్ని వర్గాల ప్రజలకు అలవికాని హామీలిచ్చి ఇప్పుడు ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. వ్యాపారులు, ఉద్యోగులు, పేద, మధ్యతరగతి ప్రజలు ఎవరూ కూడా ఈ ప్రభుత్వంలో సుఖంగా లేరని విమర్శించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి అంటే అది ఒక్క పవన్ కళ్యాణ్‌తోనే సాధ్యమన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ నిజాయితీ, నిబద్ధత పట్ల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్‌కు ఒక అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి ప్రజలు వచ్చారని, రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని నేరేళ్ళ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా 19వ డివిజన్‌కి సంభందించిన పానకాల లక్ష్మణ్, పానకాల శంకర్, శ్రీనివాస్ తదితరులకు నేరేళ్ళ సురేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, నగర ప్రధాన కార్యదర్శి చింతా రాజు, కార్యదర్శులు బందారు రవీంద్ర, నాగేంద్ర సింగ్, పుల్లంసెట్టి ఉదయ్, రెల్లి నాయకుడు సోమి ఉదయ్, 20వ డివిజన్ అధ్యక్షుడు బాలకృష్ణ, వీర మహిళ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళాతపస్వి గరికపాటి

విశాలాంధ్ర-గుంటూరు : సంస్కృతిని, ప్రజలను సజీవంగా చైతన్యవంతంగా ఉంచగలిగేవి కళలు మాత్రమేనని ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి గని అన్నారు. ప్రజా కళాతపస్వి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 108వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ మెరుగైన జీవితం సాధించడం కోసం సాంస్కృతికంగా జోక్యం చేసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఇప్టా నిబద్ధతతో పోరాడుతుందని, సామ్రాజ్యవాదాన్ని, వలస వాదాన్ని ప్రారదోలి, స్వాతంత్ర ఆర్థిక అభివృద్ధి నెలకొల్పడానికి స్వతంత్ర కాలంలో ప్రజానాట్యమండలి నిర్వహించిన పాత్ర, గరికపాటి సేవలు అజరామరమని గని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజానాట్యమండలి నాయకులు నూతలపాటి చిన్న, సిహెచ్ విజయ్ కుమార్, రమణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చిరస్మరణీయురాలు సుధాబాల

విశాలాంధ్ర-తెనాలి : ప్రజాసాహితి మాసపత్రిక ప్రధాన సంపాదకుడు, నగరం డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ కొత్తపల్లి రవిబాబు సతీమణి కొత్తపల్లి అరుణ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు అదే రోజు ఆమె నేత్రాలను గుంటూరులోని అగర్వాల్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం సుధాబాల శరీరాన్ని విజయవాడ దగ్గర్లోని నిమ్రా మెడికల్ కాలేజీకి దానమిచ్చారు. స్థానిక ఈటీ కాలనీలోని నివాసం వద్ద ఆదివారం సుధాబాల సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంత రావు అధ్యక్షత వహించారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు దివి కుమార్ మాట్లాడుతూ అయుదున్నర దశాబ్దాలుగా జనసాహితీ సంస్థకు, ప్రజాసాహితి మాసపత్రికకు సుధాబాల ఎంతో ఆత్మీయంగా ఉంటూ వచ్చినట్టు గుర్తుచేసుకున్నారు. ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు సహచరిగా కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ, ప్రజాసాహితి కార్యక్రమాలకు ఆటంకం లేకుండా కాచుకున్నారని చెప్పారు. రవిబాబు స్వాతంత్ర్యోద్యమ కుటుంబం నుంచి వచ్చినందున, ఆ అభ్యుదయ భావాలను సుధాబాల పుణికిపుచ్చుకుందని అభిప్రాయపడ్డారు. మెడికల్ కాలేజీకి శరీరాన్ని దానమిచ్చే సద్గుణం తెనాలి నుంచే మొదలైందని చెప్పారు. 1940వ దశకంలో తెనాలికే చెందిన డాక్టర్ ఉల్లక్కి గుంటూరు మెడికల్ కాలేజికి తన శరీరాన్ని దానంగా ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఆయన ఆదర్శంగా ఆ సంప్రదాయం ఇప్పటికీ అక్కడక్కడా కొనసాగటం గొప్ప విషయంగా చెప్పారు. సంప్రదాయాలకు ప్రాముఖ్యతనిచ్చే వారిని సుధాబాల ఎప్పుడూ గౌరవించే వారని, తాను మాత్రం శాస్త్రీయత అవసరాన్ని నొక్కి చెప్పేవారని పలువురు వక్తలు గుర్తుచేసుకున్నారు. స్త్రీ విముక్తి సంగటన రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సి.విజయ తన ప్రసంగంలో సుధాబాలతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ శ్రేయస్సుతోనే అభివృద్ధి కాదని, మనచుట్టూ ఉన్న సమాజం అభివృద్ధి చెందటానికి మనిషి దోహదపడాలన్న ఆలోచనతోనే ఆమె చివరివరకు కొనసాగారని చెప్పారు. వ్యక్తులుగా విడిపోతున్న నేటి సమాజంలో కుటుంబం ఉద్యమాలకు ఎంత అవసరమో సుధాబాల నిరూపించారని పౌరహక్కుల సంఘం జిల్లా నేత రాజారావు అన్నారు. సమాజం సమసమాజంగా రూపుదాల్చడానికి సాంస్కృతిక సంస్కృతి అవసరాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రవిబాబుకు పూర్తి సహకారం అందించారని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, బౌద్ధ ఉద్యమ ప్రముఖుడు బొర్రా గోవర్ధన్, కొల్లి మురళి, అంకురం సినిమా దర్శకుడు సి.ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, ఎ.పాండురంగవరప్రసాద్, భార్గవశ్రీ, గోరంట్ల లోకేష్, మండవ శోభారాణి, డాక్టర్ పిల్లి వాసు, డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, సీహెచ్ నాగిరెడ్డి మాట్లాడారు. నందూరి నారాయణరావు, చందు నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

బోట్ యార్డును వైసీపీ కార్యాలయానికి ఉపయోగిస్తే ఊరుకోం: జనసేన

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి సీతానగరం నిరుపయోగంగా ఉన్న బోట్ యార్డును ఆదివారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడబ్ల్యూడీ బోటు యార్డ్‌లో ఎన్నో విలువైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బోట్ యార్డు స్థలాన్ని ఐటీ కాలేజి లేదా హాస్పిటల్ నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. వైసీపీ కార్యాలయ నిర్మాణానికి బోటు యార్డు స్థలాన్ని ఉపయేగిస్తే సమస్యను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి కచ్చితంగా అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అనంతరం నియోజకవర్గంలో నిరపయోగంగా ఉన్న బోట్ యార్డును అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షులు మునగ పాటి వెంకట మారుతీరావు, రాష్ట్ర ఐటీ విభాగం కో-ఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, తాడేపల్లి మండల ఉపాధ్యక్షులు తంబి, సీనియర్ నాయకులు నారాయణ, తాడేపల్లి మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నిరంజన్, మంగళగిరి పట్టణ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ జొన్నాదుల పవన్ కుమార్, చిల్లపల్లి యూత్ సభ్యులు మేకల చంద్రశేఖర్, పెనుమాక గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

మక్కా మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే చేయూత

విశాలాంధ్ర-మంగళగిరి : నగర పాలక సంస్థ పరిధిలోని పాత మంగళగిరి అంజుమన్ స్మశాన వాటిక వద్ద నిర్మాణం జరుగుతున్న మక్కా మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని మంగళగిరి పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మైనార్టీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ ఫిరోజ్, పఠాన్ అష్రఫ్ ఖాన్, మైనార్టీ నాయకుల చేతులమీదుగా అంజుమన్ సంస్థకి అందజేశారు. మసీదు నిర్మాణానికి సహకరించి ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే ఆర్కేకి అంజుమన్ సంస్థ వారు ధన్యవాదాలు తెలియజేశారు.

కళాతపస్వి సంస్మరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు జాతి ఆత్మ స్వరూపాన్ని తన చిత్రాలన్నింటా ఆవిష్కరించిన కళాతపస్వి కె.విశ్వనాథ్ అని ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి రామ్‌కుమార్ కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ కళాత్మకతతోనూ కాసుల పంట సాధ్యమేనని తన సినిమాల ద్వారా నిరూపించిన దర్శకుడు కె.విశ్వనాథ్ అన్నారు. తమ చలనచిత్ర సృజనవైభవాన్ని ఆత్మగౌరవంతో ఆరంభించారని, ఆయనది వెండితెరపై చెరగని తెలుగు సంతకం, గుండె పొరల్లో చెదరని తీపిజ్ఞాకమన్నారు. అనంతరం విశ్వనాథ్ సన్నిహితుడు తల్లం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సినిమాలు చూస్తే యువతరం పెడదారి పడుతుందన్న మాట ఎంత నిజమో తెలియదుకానీ విశ్వనాథ్ చిత్రాలు యవతను మంచిదారిలో పెడతాయన్నది పచ్చి నిజమన్నారు. సినీరంగ విశ్లేషకులు డి.ఫణీరావ్ మాట్లాడుతూ సంగీత ప్రాధాన్యంగా కనిపించే ఆయన చిత్రాలలో సాహిత్యానికి అగ్రస్థానం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, సుభాని, భాగ్యలక్ష్మీ, వెంకటేశ్వర్లు, లావణ్య, ఇందుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని ద్రోహం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని ద్రోహం జరిగిందని విద్యావేత్త బీసీహెచ్ అనంతరామయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'నానాటికి నిర్లక్ష్యానికి గురవుతున్న ఆంధ్రప్రదేశ్'అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా అనంతరామయ్య మాట్లాడుతూ ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీ ప్రస్తావనే లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్ళు అయినా రాష్ట్ర విభజన చట్టంలో రాష్ట్రానికి పేర్కొన్న అనేక హామీలను ఈ బడ్జెట్‌లో పేర్కొనలేదని అన్నారు. పైపెచ్చు రాష్ట్రాల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసేలా అనేక ఆంక్షలు పెట్టిందని విమర్శించారు. ప్రముఖ విశ్లేషకులు ఎస్.సదాశివం మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేసి పక్కనున్న ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్షత చూపించటం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ఏపీకి అన్యాయం జరిగిందని అంగీకరిస్తూనే ప్రతి బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న కేంద్రంపై సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ చర్చలో కొండా శివరామిరెడ్డి, బీటీ గుప్తా, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

కేఎల్‌యూలో నూతన ఆవిష్కర్తలకు వర్క్ షాప్

విశాలాంధ్ర-తాడేపల్లి: మేధో సంపత్తి హక్కుల యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి నూతనంగా ఆవిష్కరణలు చేపట్టే వారికి అవగాహన కల్పించేందుకు కెఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఒక రోజు వర్క్ షాపును నిర్వహించారు. ఎసిఐసి కెఎల్ స్టార్టప్‌ల ఫౌండేషన్, కెఎల్ ఐపిఎస్‌సిల సహకారంతో ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఎసిఐసి సిఇఒ గోవిల్ అలోక్ అన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశ్రమల స్థాపన శాఖ అధికారి సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ ప్రవేశ వ్యూహాలలో పోటీ ప్రయోజనాల గురించి వివరించారు. నూతన ఆవిష్కర్తలకు మేధో సంపత్తి హక్కులను పొందడం, ఆవిష్కరణలు, ప్రమాణాల భావనను వివరించారు. కెఎల్ విశ్వవిద్యాలయం పరిశోధన అభివృద్ధి విభాగ అధిపతి జై కుమార్ సింగ్ మాట్లాడుతూ పరిశోధన యొక్క ప్రాముఖ్యతను చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పరిశోధకులు మరియు నిపుణులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎం.సాయికిరణ్, రాఘవరావు, పలుమార్లు విద్యార్థులు పాల్గొన్నారు.

బీపీ మండల్ 2 ఉద్యమం బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ ఈ నెల 10 తేదీ నుండి తలపెట్టిన బీపీ మండల్ 2 ఉద్యమం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో జరగనున్న ఉద్యమ బ్రోచర్‌ని నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ యువజన కార్యాలయం, ఎర్రబాలెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం బీసీలు రాజకీయ, విద్య, వైద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో మేమెంతో మాకంత అను నినాదంతో కొనసాగుతున్న కార్యక్రమానికి బీసీ సోదర సోదరీమణులు అందరూ హాజరై బీసీల బలాన్ని చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పాల రాజ్ కిరణ్, జిల్లా మహిళా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గం గౌరవ అధ్యక్షురాలు మరిదు పుష్పాంజలి, గోలి కస్తూరి, పొట్లూరి బెనర్జీ, చొప్పవరపు గోపి, నల్లబోతుల సుబ్బారావు, అంకం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-తెనాలి : స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తెనాలి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్ పంప్స్, సుబ్రం వాటర్ సంస్థల సహకారంతో పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. తెనాలి, పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున విచ్చేశారు. క్యాంప్ ఇన్‌ఛార్జ్ బీవీ నాగబాబు పర్యవేక్షణలో డాక్టర్ స్పందన, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ దివ్యశంకర్‌లు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి శుక్లాల ఆపరేషన్లు చేయాలని చెప్పారు. మొత్తం 305 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 95 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరందరినీ త్వరలోనే శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి, ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలియజేశారు. కుమార్ పంప్స్ బాధ్యులు కొత్త శ్రీనివాసకుమార్, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్ పర్యవేక్షించారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

పేదల సొంతింటి కల తీర్చడమే లక్ష్యం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : రాష్ట్రంలో పేద వాళ్లందరికీ సొంతింటి కల తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేట మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలోని జగనన్న కాలనీలో పలు గృహప్రవేశాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా సొంతిల్లు కట్టుకోవడమనేది ప్రతి పేదవాడి కల అని, ఆ కలను తీర్చేందుకు జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాలతో పాటు.. ఇళ్లు కూడా కట్టించి ఇస్తున్నామన్నారు. సొంత స్థలాలు ఉన్నవారికి కూడా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అందరూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. నూతనంగా గృహప్రవేశాలు నిర్వహించుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మండల వైసీపీ కన్వీనర్ చిలకా చంద్రయ్య, జడ్పీటీసీ సభ్యులు విజయ ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ కృష్ణనాయక్, సాయి రెడ్డి, అల్లా నెల్లూరు చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సూచనలు పాటించండి

విశాలాంధ్ర-దుర్గి : పొలాల్లో విద్యుత్ మోటార్లు ఉన్న రైతు సోదరులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పలు సూచనలు పాటించాలని విద్యుత్ శాఖ మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు విజ్ఞప్తి చేశారు. మోటార్లు, మోటార్లకు అమర్చిన స్టార్టర్లను సొంతంగా రిపేర్లు చేసుకోకుండా, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బందివారితో రిపేర్లు చేయించుకోవాలని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న డీబీటీ స్కీమ్ క్రింద రైతు సోదరులకు నాణ్యమైన, షాక్ తగలని స్టార్టర్ బాక్స్, ఎర్త్ పైప్, కెపాసిటర్ ఇచ్చుటకు నిర్ణయించారన్నారు. త్వరలోనే ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీబీటీ స్కీమ్‌ను ట్రాన్స్‌ఫార్మర్స్ కలిగిన ప్రతి రైతుకు ఉచితంగా బిగిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్ణ చంద్రావతి మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ప్రజానాట్యమండలి సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు, బ్రాహ్మణ ఐక్యవేదిక సభ్యులు, ప్రగతి కళా మండలి సభ్యులు, విలేకరి గుండవరపు అమర్నాథ్ సతీమణి పూర్ణ చంద్రావతి గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. ఆమె ఆకస్మిక మృతికి సీపీఐ నాయకులు నరిశెట్టి వేణుగోపాల్, యిర్మీయా, కంబాల శ్రీనివాస్, తిరుపతిరావు, బ్రాహ్మణ సంఘ సభ్యులు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, గణపవరపు రంగారావు, సీనియర్ జర్నలిస్ట్ నందా సాంబశివరావు, కేకే మూర్తి, జర్నలిస్టులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని అడిగొప్పల శివారులో నిదానంపాడులో వేంచేసియున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా టిక్కెట్లు కొన్న భక్తులకు ఆలయ ప్రధాన అర్చకస్వాములు విజయకుమార్(ఢిల్లీ) గోత్ర నామాలతో అభిషేకాలు చేశారు. మొక్కుబడులు, కానుకలను హుండీల్లో సమర్పించుకున్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ కళ్యాణ వేడుకలు

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని వేల్పూరు, ఘంటావారిపాలెం తదితర గ్రామాల్లో శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి వార్ల కళ్యాణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద వేంచేసి ఉన్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి వార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు ఆధ్వర్యంలో స్వామి వార్లకు తెల్లవారుజామునే గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, శాంతి హోమం విశేష అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన కళ్యాణ వేడుకలలో దంపతులు పాలొన్నారు. వేలాదిగా మహిళలు పాల్గొని అమ్మ వారికి పొగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య స్వామి కళ్యాణం

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక బొద్దాయి సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు తమ పుట్టిళ్ళకు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భారీ అన్నదాన కార్యక్ర మం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, పీజేబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ పడాల శివారెడ్డి, గ్రామ మాజీ సర్పంచులు గెల్లి చినకోటిరెడ్డి, పదాల చక్రారెడ్డి, గెల్లి వెంకటరెడ్డి, వైసీపీ మండల నాయకులు అన్నెం పున్నారెడ్డి, మానుకొండ వాసు దేవరెడ్డి, గెల్లి కోటిరెడ్డి, శివారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామస్వామి ప్రతిష్ట మహోత్సవాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో ఆదివారం సీతారామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాలు నడుమ భక్తుల వివిధ రకాల పూజా కార్యక్రమాలతో పాటు ధ్వజ స్తంభం ఆంజనేయస్వామి శిఖరాలు వేద బ్రాహ్మణులు పరుచూరి శ్రీనివాసచార్యులు శ్రీపతి బాలకృష్ణ చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు నంబూరు శంకరరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దుశ్శాలువాలు పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కల్లి శ్రీనువాస రెడ్డి, ఈదా సాంబి రెడ్డి, చిర్ర రాజశేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రిత్విక చిర్ర శ్రీనివాసరెడ్డి, వజ్రాల వెంకట్ రెడ్డి, కేసరి గంగారెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మొగులూరు అనిల్ కుమార్, బత్తుల కోటేశ్వరరావు, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికథ, భక్తులచే భజనవలి కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి.. టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి..

జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో ఉన్న జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు ఐదు లక్షల ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో కలిసి అఖిల పక్ష రాజకీయ పార్టీల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వాలని లేదా ఒక్కొక్క లబ్ధిదారునికి ఇంటికి ఐదు లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను మౌలిక వసతులు ఏర్పాటు చేసి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు అర్జీలు ఇవ్వడం జరుగుతుందని లబ్ధిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు ఆర్కే నాయుడు, జనసేన ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సాంబయ్య, అఖిల్, సాగరు, షేక్ మస్తాన్, మల్లికార్జున, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో జనాల రక్తం పీలుస్తున్న జగన్: జీవీ

విశాలాంధ్ర-బొల్లాపల్లి : మద్య నిషేధం చేస్తానంటూ అధికారాన్ని చేజిక్కించుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పి కల్తీ మద్యం అమ్ముకుంటూ ప్రజల రక్తం పీలుస్తున్నాడని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా కన్వీనర్, వినుకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆరోపించారు. జగన్‌మోహన్ రెడ్డి అమ్ముకుంటున్న మద్యం తాగితే ప్రజల ప్రాణాలు పోవటం ఖాయమని ఆరోపించారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలోని నెహ్రూనగర్ తండాలలో జీవీ విస్తృతంగా పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో తండవాసులను పట్టించుకోలేదని ఈ సందర్భంగా జీవీతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని అన్నారు. నెహ్రూ నగర్ తండాలో తన హయాంలో వేసిన వాటర్ ట్యాంకు వైసీపీ వాళ్లు రంగులు పూసుకున్నారని, తాను గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తే ప్రస్తుత శాసనసభ్యులుకు కనీసం డ్రైనేజీ కాలువలు కూడా నిర్మించడం చేతకాలేదన్నారు. జగన్ రెడ్డి పాలనలో నిత్యవసర సరుకులు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు అన్ని రకాల ధరలు పెరిగి గ్రామీణ ప్రజల జీవనం దుర్భరంగా మారిందని దుయ్యబట్టారు. ఇటువంటి పాలకులను తరిమికొట్టి తిరిగి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు గ్రామగ్రామాన ప్రజలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, హనుమాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా: చదలవాడ

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసు కెళ్తానని నరసరావుపేట టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదల వాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్లలోని భగత్ సింగ్ భవన్‌లో ది ఆర్ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన సమావేశానికి అరవిందబాబు హాజరయ్యారు. అసోసియేషన్ కోశాధికారి సంగీతరావు ఈ కార్యక్ర మానికి సభాధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలు అందించే సేవలు వర్ణనాతీతమని వారి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ క్లినిక్‌లలో తగిన అర్హతగలిగిన ఆర్ఎంపీ, పీఎంపీలను ఉద్యోగులుగా ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ మాట్లాడుతూ రొంపిచర్లలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని నిర్మించేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని అరవిందబాబును కోరగా తప్పకుండా సాయం అందిస్తా మని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపీ, పీఎంపీ సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యేలతో మాట్లాడించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించి వారికి తగిన సర్టిఫికేట్లను అందించి ఉద్యోగాలలో ప్రాధాన్యతనివ్వాలని కృషిచేసి అందుకు తగిన నిధులను కేటాయించి శిక్షణా తరగతులు కొనసాగించారని. ఆయన మరణానంతరం శిక్షణా తరగతులు ఆగిపోయి వారి భవిష్యత్ అంధకా రంగా మారిందని ఈ శిక్షణా తరగతులు తిరిగి ప్రారంభించేలా కృషిచేయాలని కోరుతూ ది ఆర్ఎంపీ, పీఎంపీ, కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలుస్తామని రమేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వి.అంకిరెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు ఎస్.భాస్కర్ రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు డి.హనుమంతురావు, గౌరవ సలహాదారు ఎంవీ సత్యనారాయణ, మధార్ వలి, సంగీతరావు, హరిబాబు, వెంకటేశ్వర్లు, కాళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-రొంపిచర్ల : ఉచిత మెగా వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నరసరావుపేటకు చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరము నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ నరసరావుపేటలో పేరున్న ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ఆయన హస్తవాసి మంచిదని ఇప్పటికి ప్రజలు చెప్పుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈ వైద్యశిబిరంలో గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 256 మందికి కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. వారిలో 85 మందిని ఆపరేషన్ కేసులుగా గుర్తించారు. వారికి తమ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైసీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు చపారపు గోపాలరెడ్డి, పీజేబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ పడాల శివారెడ్డి, గ్రామ మాజీ సర్పంచులు గెల్లి చినకోటిరెడ్డి, పదాల చక్రారెడ్డి, గెల్లి వెంకటరెడ్డి, వైసీపీ మండల నాయకులు చపారపు సంజీవరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, బత్తుల రామకృష్ణ, పడాల హనిమిరెడ్డి, గుండాల వెంకటేష్, కల్లి పిచ్చిరెడ్డి, బొజ్జ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం: అంబటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రామకృష్ణాపురం బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, తల్లిదండ్రులకు, విద్యార్థులకు భరోసా కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు పేర్కొన్నారు .ఆదివారం ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్‌తో కలిసి రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మంచినీటి వనరులు, ఆరో ప్లాంట్, వంటగది విద్యార్థులు తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తాగునీటి కలుషితంతోనే విద్యార్థులు అస్వస్థత గురైనట్లు ప్రాథమిక నివేదిక ద్వారా తెలిసిందని వివరించారు. జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు నమూనాగా రామకృష్ణాపురం గురుకుల పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ 206 బాలికలు అస్వస్థతకు గురికావడానికి తాగునీటిలో బ్యాక్టీరియానే కారణమని రిపోర్టులు వచ్చినట్టుగా వెల్లడించారు. ఆర్వో ప్లాంటు ఆధునీకీకరణతో పాటు నీటి ఎద్దడి లేకుండా 3 బోర్లు వేపించామన్నారు. జిల్లాలోని 60 గురుకులాలు, 20పైకి ఉన్న కెజిబిపి పాఠశాలలలో మెరుగైన సౌకర్యాల్ల కల్పనకు ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, రాజుపాలెం సర్పంచ్ పులి బండ్ల అశోక్, తహసిల్దార్ నగేష్, గురుకుల పాఠశాల సిబ్బంది, పలు శాఖల అధికారులు తదితరులున్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

విశాలాంధ్ర-నరసరావుపేట: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నరసరావుపేట ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డా. జెఎన్ సురేష్ అన్నారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజ్ క్యాంపస్‌లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర గుంటూరు, ఎడ్యుకేట్ ది సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఇతర పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, డా.జేఎన్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని అన్నారు. విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించినట్లయితే శారీరికంగా మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. ప్రిన్సిపల్ జేఎన్ సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, ఓటమి-గెలుపుకు నాంది అన్నారు. ఓటమిని చూసి నిరాశ పడకుండా, గెలుపు వైపు అడుగులు వేయాలని సూచించారు. ఎడ్యుకేట్ ది సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్, ఎథిక్స్ కమిటీ మెంబర్ షేక్ బాజి షాహిద్ అన్సారీ మాట్లాడుతూ దేశంలో చాలామంది ప్రముఖ క్రీడాకారులు గ్రామస్థాయి మూలాల నుంచి ఎదిగారని క్రీడాకారులు అందరూ ఈ జిల్లా స్థాయి క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పిడిలు కృష్ణారెడ్డి, ఝాన్సీరాణి, బి.రాజేంద్ర ప్రసాద్, జిల్లాలో వేరు వేరు ప్రాంతాల నుంచి యువజన సంఘాల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-మాచర్ల: జగనన్న ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు, నాటి టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న కలెక్టరేట్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ మాచర్ల ఏరియా సెక్రటరీ మేకపోతు శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే టిడ్కో ఇంటిని 1 రూపాయికే లబ్ధిదారులకు ముట్టచెప్తామంటూ మాట్లాడి, అధికారం చేపట్టాక మాట తప్పాడన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారుల నుండి లక్షలాది రూపాయలు డిపాజిట్లు కట్టించుకున్నారన్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన పేద ప్రజలను పార్టీల పేరుతో ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ఒక్కొక్క ఇంటికి రూ.1.80 వేలకు బదులు రు.5 లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు చొప్పున స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ధర్నాలో ప్రజా సంఘాలు, కార్మికులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో టౌన్ సెక్రటరీ మిద్దె పోగు బాబురావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఈపూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇవ్వాలని లేదా ఒక్కొక్క లబ్ధిదారునికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో మండలం నుంచి జగనన్న ఇళ్ల లబ్ధిదారులు పాల్గొని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సూరే బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అందమైన చేతివ్రాత'

విశాలాంధ్ర-వినుకొండ: ఒక్కరోజులో అను ప్రత్యేక కార్యక్రమంలో దాదాపు 70 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు చేతివ్రాత నైపుణ్యం పెంపొందించేందుకు వి.రామ్మోహన రావు (జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత) శిక్షణలో వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు బివి నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా 19వ వార్డు కౌన్సిలర్ ఎం.ఎస్.కే భాష ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాయటం మంచి కళ అని, అందమైన చేతివ్రాత నేర్చుకుంటే అక్షరాలు ఆయుధాలుగా మారుతాయని, తద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. కాలిగ్రఫీ నేర్చుకునే లాగా పిల్లలను తల్లి దండ్రులు ఎక్కువగా ప్రోత్సహించాలని విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడంతో పాటు, ఎక్కువగా రాయటం అలవాటు చేసుకుంటే చేతివ్రాతలో మరింత నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షులు బివి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేతివ్రాతను బట్టి మనిషి వ్యక్తిత్వం గుణగణాలు చెప్పవచ్చని అంటారు. విద్య ఉద్యోగ రంగాలలో రాణించాలన్న చేతివ్రాత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రముఖ చేతివ్రాత నిపుణులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి రామ్మోహన రావు మాట్లాడుతూ లక్ష మందికి దస్తూరిపై శిక్షణ ఇవ్వాలని తన లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పలు పాఠశాలలో 825 మంది టీచర్లకు 20వేల 400 మంది విద్యార్థులకు కాలిగ్రఫీలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. "చిట్టి చేతులు చక్కని రాతలు" అనే కార్యక్రమంనకు రూపకల్పన చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులు శ్రీమతి గంగవరపు వెంకాయమ్మ మాట్లాడుతూ అందమైన చేతివ్రాతను బాల్య దశ నుండి విద్యార్థులు నేర్చుకోవాలని తర్వాత ప్రయత్నించిన రాత మారదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రమేష్ ఎస్కే సుభాని, మరియు పి నాయక్ కాలిగ్రఫీ ఫ్యామిలీ మెంబర్స్‌గా వ్యవహరించి 70 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. చివరగా జాతీయ అవార్డు గ్రహీత వి రామమోహన రావును ట్రస్ట్ అధ్యక్షులు బివి నాగేశ్వరరావు దుశ్శాలువా జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

నేటి ధర్నా జయప్రదం చేయండి: మారుతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ ఆరోపించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు సరిపోవని, రూ.5 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం కేవలం ఒక సెంటు భూమి మాత్రమే ఇచ్చిందని, అందులోనే కుటుంబం అంతా కిక్కిరిసిన జీవితాన్ని గడపాల్సిన పరిస్థితులను కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి, పశువుల పెంపకానికి అవకాశమే లేకుండా చేసిందన్నారు. గతం నుంచి సీపీఐ పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇంటిస్థలం ఇవ్వాలని పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగనన్న కాలనీలలో చాలీచాలనీ డబ్బులు ఇచ్చి వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, లేకపోతే వాటిని రద్దు చేస్తామని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో లబ్ధిదారులు వడ్డీలు తెచ్చి మరీ ఇళ్ల నిర్మాణలు చేపడుతున్నారని వివరించారు. అనేక ప్రాంతాలలో గతంలోనే పూర్తి అయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయకుండా ప్రభుత్వం తాత్సరం చేస్తుందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ మౌలిక సదుపాయాలు కల్పించి టిడ్కో గృహాలను స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 22న విజయవాడలో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల చిలకలూరిపేట మండలం వేలూరులో మృతి చెందిన పార్టీ నాయకులు బొంతా దానియేలు, మస్తాన్‌రావుల సంస్మరణ కార్యక్రమం ఈ నెల 9వతేదీ ఘనంగా నిర్వహించటానికి తీర్మానించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ, ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుబాని, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పేలూరి రామారావు, దాసరి వరహాలు, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు, సురభిరాజు, మద్దుకూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలోని 14 పరీక్ష కేంద్రాల్లో ఎన్.ఎం.ఎం.ఎస్ 2023 ప్రవేశ పరీక్ష, జిల్లా విద్యాశాఖ అధికారి మేకతోటి వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రశాంతంగా జరిగినది. జిల్లాలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించెందుకు 14 సెంటర్లు ఏర్పాటు చేశారు. నరసరావుపేట పట్టణంలో 6 సెంటర్లలో, సత్తెనపల్లిలో నాలుగు సెంటర్లలో, గురజాలలో నాలుగు సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 3180 మంది విద్యార్థులు దరఖాస్తు చేసారు. 3066 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు.

ధర్నాను జయప్రదం చేయండి: సీపీఐ

విశాలాంధ్ర-కారంపూడి: పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి షేక్ సైదా కోరారు. ఆదివారం సైదా ఇంటి వద్ద సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీ పేరుతో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను కేటాయించి నేటికి ఇళ్లు నిర్మించలేదన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం యిచ్చే నగదు రూ 1.80 లక్షలు ఏ మాత్రం సరిపోవన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఉచిత సిమెంట్, ఇసుక ఇవ్వాలని భారతకమ్యూనిస్టు పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీలో వెంటనే ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నర్సరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల సహాయకార్యదర్శి కూరాకుల వెంకటశివయ్య, పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, ఒప్పిచర్ల కార్యదర్శి ఇందూరి శ్రీను, కొదమ గుండ్ల కార్యదర్శి మేకపోతు చినకోటిరెడ్డి, చౌకాల నాగేశ్వరరరావు పాల్గొన్నారు.

డెంటల్ హాస్పిటల్ ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని ముళ్ళమూరు బస్టాండ్ వద్ద శ్రీ రామ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మానాయుడు తనయుడు యువనాయకులు బొల్లా గిరిబాబు, నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అలాగే వినుకొండ పట్టణం మార్కాపురం రోడ్డు కారు బిల్డింగ్ వద్ద రామ్ శ్రీ దంత వైద్యశాల నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మండల సచివాలయ కన్వీనర్‌గా వెంకటేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-కారంపూడి: మండల సచివాలయ కన్వీనర్‌గా అల్లు వెంకటేశ్వరరెడ్డిని మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అల్లు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న నవరత్నాల పథకాలను వార్డు వాలంటీర్ల సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

సంత్ శిరోమణి గురు రవిదాసు జయంతి

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ముటుకూరులో ఆదివారం చర్మకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంత్ శిరోమణి గురు రవిదాసు 646వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. చర్మకారుల సంఘం నాయకులు పులిమెల నాగేశ్వరరావు మాట్లాడుతూ రవిదాసు అణగారిన కులాలకు రామశ్లోకాలను తెలియజేస్తూ, వారి జీవితాలను, మనుగడను వివరిస్తుంటే మనువాదులు ఆయనను తప్పుపట్టి ఊరికి దూరంగా తన తల్లిదండ్రుల చేత గెంటి వేసే విధంగా మనువాదులు బెదిరిస్తే, రవిదాసు తండ్రి మాటను శిరసావహిస్తూ కుటుంభం నుంచి దూరంగా పోయారన్నారు. అట్టడుగు, అణగారిన ప్రజలను చైతన్యవంతులను చేస్తూ వారి కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ రవిదాసు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాచర్ల అమరయ్య, పులిమెల ఏసుదానం, కుక్కమూడి చిన్నయ్య, పులిమెల చిన్నోడు, మాచర్ల మాణిక్యం, మార్కు బంకా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్ రోడ్డులోని చీలురోడ్డు సెంటర్ వద్ద ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొంటారని తెలిపారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు రూ. 5లక్షలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను అన్నీ సదుపాయాలతో పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలం కేటాయింపులో పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి ధర్నాలో భాగస్వాములు కండి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర- గుంటూరు : టిడ్కో ఇళ్ళను స్వాధీనపరచాలని, జగనన్న కాలనీ వాసులకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 6వ తేదిన తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో ప్రతిఒక్క లబ్ధిదారుడు భాగస్వామి కావాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమ విజయవంతాన్ని కాంక్షిస్తూ సీపీఐ బృందం గుంటూరు నగరంలో ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులను కలుసుకుని వారి బాధలను విన్నారు. లబ్ధిదారులు అధైర్యపడవద్దని సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కోట మాల్యాద్రి మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.1.80 లక్షలతో కనీసం పునాది కూడా పూర్తి కాని పరిస్థితి ఉందని, అలాంటిది ఇంటి నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వ బెదిరింపులతో ఇళ్ళు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు అప్పులపాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలతో పాటు ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా టిడ్కో లబ్ధిదారులకు కూడా వారి గృహాలను స్వాధీనపరచాలన్నారు. టిడ్కో గృహాలు పూర్తి చేసి ఆరు సంవత్సరాలు గడిచిందని, ఆనాడు గృహాలకు అప్పులు చేసి మరీ నగదు చెల్లించిన లబ్ధిదారులు వాటికి వడ్డీలు చెల్లించలేక ఉన్న ఇంటికి అద్దెలు కట్టలేక అల్లాడుతున్నారని తెలిపారు. తక్షణమే వారికి గృహాలు స్వాధీనపరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, చల్లా మరియదాసు, విజయ్ కుమార్, యశ్వంత్, శ్రీనాథ్, అనిల్, కృష్ణ, సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో యజ్ఞ హాస్పిటల్ ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నూతనంగా ఏర్పాటైన బాపట్ల జిల్లాలో ఆదివారం పట్టణంలోని సూర్య లంక రోడ్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన యజ్ఞ హాస్పిటల్‌ను శాసనసభ్యులు కోన రఘుపతి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో గుంటూరు, విజయవాడ నగరాలకు ఇకనుండి వెళ్లవలసిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ, ఎంబిబిఎస్ ఎండి జనరల్ మెడిసిన్ డాక్టర్ మాధవి బెల్లంకొండ ఎంబిబిఎస్ డి ఎం ఆర్ డి రేడియాలజీ జనరల్, స్త్రీల వైద్య నిపుణులు, డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, డాక్టర్ మౌలాలి, డి.ఎస్.పి శ్రీనివాసరావు, చేజర్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల జిల్లా వ్యవసాయ కళాశాలలో 1986 సంత్సర బీఎస్సీ విద్యార్థులు 1993వ సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. అలాగే పూర్వ విద్యార్థులు కళాశాలలో అవుట్సోర్సింగ్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అదేవిధంగా పూర్వ విద్యార్థులు కళాశాలలో జరిగే పలు సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకోడం విశేషం.

General Notice
IN THE COURT OF THE HON'BLE 1ST ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR
Creditor I.P.No:106/2022

Between:
1) Akula Seetha Maha Lakshmi, W/o. Nageswara Rao, R/o. Rajiv Swagruha, Block No:1G8, Old Guntur, Guntur. 2) Kalyanam Sree Harihara Murthy, S/o.Rama Pullaiah, 3) Kalyanam Sireesha, W/o. Sree Harihara Murthy, 2&3 are R/o. Flat No:401, Virat Sai Towers, Hanuman Nagar, Amaravathi Road, Backside Of IDHospital, Nagaralu, Guntur. **- Petitioners**

And

1) Guntupalli Subba Rao, S/o. Uma Maheswara Rao, R/o. Door No:15-6-81,1st line Redla Bazar, Old Guntur, Guntur City - 522001,
2) Shaik Subhani Basha, S/o. Shaik Babu Saheb, R/o.2/69, Arunachala Apartment, Sri Perumal Nagar, Nanmangalam, Kancheepuram, Tamilnadu-600117, 3) The Official Receiver, Dist.Court Complex, Guntur - Respondents

పై నెంబరు ఐ.పి లోని పిటీషనరు, 1వ రెస్పాండెంటును ఇన్ సాల్వెంటుగా డిక్లేర్ చేసి మరియు R1 అయిన గుంటుపల్లి సుబ్బా రావు, గారు ఆర్-2 పేరుతో **ది:25-08-2022** వ్రాసిన సేల్ డీడ్ నెం: **10888/2022** యస్. ఆర్. ఒ. గుంటూరు దస్తావేజును రద్దు పరచి, దస్తావేజులు తాలూకా ఆస్తిని ఆర్-3 వారి కోర్టులో వేలం వేసి తన బాకీ ఇప్పించవలసినదిగా కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్ పై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరములు ఉన్నను తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తము **ది:10-02-2023**కి వాయిదావేసినారు. కావున ఆరోజున **ఉ. గం. 10-30ని.**లకు ఆక్షేపణలు ఉన్నవారు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 10-02-2023
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కళ్యాణం కృష్ణమూర్తి, పిటీషనర్లు తరపు అడ్వకేట్, డోర్ నెం:8-20-33/55,5వ లైను సీతారామ్ నగర్ గుంటూరు-1.
సెల్: 9440260914

నీతివంతమైన పాలన అందించటమే లక్ష్యం: కోట రహీంరెడ్డి

నాగరాజుపాలెం, కప్పలవారిపాలెంలో పాదయాత్ర

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజలకు నీతివంతమైన పాలన అందించాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని కోట రహీంరెడ్డి తెలిపారు. కర్లపాలెం మండలం నాగరాజుపాలెం, పిట్టలవానిపాలెం మండలం కప్పలవారిపాలెం గ్రామల్లో ఆదివారం ఇంటింటికి మీ రహీంరెడ్డి అనే కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించి ప్రతి ఇంటి సభ్యులను పలకరించారు. తన స్వంత నియోజకవర్గంలో కుట్రలతో కూడిన రాజకీయాలు జరుగుతున్నాయని రాజకీయ స్వార్ధం కోసం గ్రామాల్లో చిచ్చులు పెడుతూ అన్నదమ్ముల్లా కలిసి ఉండే గ్రామాల్లో విష సంస్కృతి తెచ్చారని తెలిపారు. ఉన్నత చదువు చదువుకుని ఉద్యోగం చేస్తూ నా కుటుంబాన్ని మంచిగా పోషించుకునే స్థోమత నాకు ఉన్నా నా నియోజకవర్గ ప్రజలకు జరుగుతున్న అన్యాయం చూడలేక ప్రజలను చైతన్యం చేయటానికి ప్రజలే పాల కులు అనే నినాదంతో పాదయాత్ర చేస్తున్నానన్నారు. ప్రతి కుటుంబ సభ్యులు నన్ను ఆదరించాలని రానున్న ఎన్నికల్లో మీ కుటుంబ సభ్యునికిగా బాపట్ల ఎమ్మెల్యేగా తప్పక పోటీచేస్తున్నానని తెలిపారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా మీతోనే నా జీవితాంతం ఉండి మీ సమస్యలకు నేను ఎదురుంటానని భరోసా ఇచ్చారు. పాదయాత్రకు వచ్చిన రహీంరెడ్డికి గ్రామస్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. పలువురు పెద్దలు, మహిళలు స్వాగతించారు. ఆయా గ్రామ దేవాలయాల్లో తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు వరంగా ఉచిత వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : గ్రామీణ ప్రాంత ప్రజలు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న సకల్పంతో దాతలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకుని వైద్యుల సలహాల మేరకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి అన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో విజయవాడ మణిపాల్ హాస్పటల్ సహకారంతో భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఆర్థిక స్తోమత లేక పూర్తి స్థాయిలో వైద్యం పొందలేక అనారోగ్యంతో బతుకు సాగిస్తున్న పేదలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించాలన్న మంచి ఆలోచనతో భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు అందించే సలహాలను పాటిస్తూ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని రవికిరణ్మయి కోరారు. అనంతరం వైద్య శిబిరంలో గుండె, క్యాన్సర్, మూత్రపిండాలు, దంత, తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. తొలుత వైద్య శిబిరాన్ని వైద్యులు ప్రారంబించారు. ఈ వైద్య శిబిరంలో మూత్రపిండ వైద్య నిపుణులు డాక్టర్ మహమ్మద్ అస్లాం, ప్రభుత్వ వైద్యులు ఆకురాతి శ్రీనివాసరావు, దంత వైద్య నిపుణులు డాక్టర్ కొన్నిపాటి రోజాలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేష్ అధ్యక్షులు జొన్నకూటి ధర్మారావు, ప్రధాన కార్యదర్శి దొంతు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, సహాయ కార్యదర్శి కె. శ్రీనాథ్, మెడికల్ కో ఆర్డినేటర్ తూనుగుంట్ల రాజేంద్ర, కోశాధికారి కొన్నిపాటి సత్యనారాయణ, సభ్యులు బొలిశెట్టి జయబాబు, బొలిశెట్టి శ్రీనివాసరావు, భాంతుల శ్రీధర్, డాక్టర్ ద్వారకానాథ్, వంగర బాబూజీ, పసుపులేటి శివరాంప్రసాద్, వంగర శేషగిరిరావు బూర్లె కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి మార్చురీ బాక్సు బహూకరణ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ సహకారంతో గ్రామ పంచాయతీకి అందించిన మార్చురీ బాక్సు అవసరమైన వారికి అందుబాటులో ఉంటుందని గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి అన్నారు. గ్రామ ప్రజల అవసరార్థం కీ.శే. కొన్నిపాటి చిన పరదేశి - స్వూకాంతంల జ్ఞాపకార్థం అసోసియేషన్ సభ్యులైన పరదేశి కుమా రుడు రూ. 80 వేలు విలువ కలిగిన మార్చురీ బాక్సును ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దొంతు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్, కొన్నిపాటి సత్యనారాయణ, జయబాడు, బండారు శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, వంగర బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

భగవాన్ రాజుపాలెం ఫ్లైఓవర్ కింద మహిళ

విశాలాంధ్ర-జెపంగులూరు : భాష రాదు, ఎవరితో మాట్లాడదు, ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు, ఎందుకు వచ్చిందో తెలియదు. 45 సంవత్సరాల వయసు గల ఒక మహిళ, గత కొన్ని రోజులుగా మండలంలోని భగవాన్ రాజుపాలెం లో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉంటుంది. ఆమె ఎవరితోనూ మాట్లాడదు. ఎవరిని పలకరించదు. ఆకలేస్తే మాత్రం ఏదో ఒక ఇంటికి వెళ్లి చేయి చాపుతుంది. అన్నం తిని మళ్లీ ఫ్లై ఓవర్ దగ్గరికి వచ్చి పడుకుంటుంది. పేరు చెప్పమన్నా, ఊరు చెప్పమన్నా, అర్ధం కాలేదో, మాటరాదో తెలియదు. ఇక్కడికి వచ్చిన రోజు నుండి ఒకే పంజాబీ డ్రెస్‌లో ఉంటుంది. ఇంకా ఆమెకు కట్టుకునేందుకు బట్టలు లేవు. పడుకునేందుకు ఒక దుప్పటి, రెండు మంచినీళ్ల బాటిల్లు తప్ప మరేమీ ఆమె దగ్గర లేవు. ఆమెను ఎవరైనా మాట్లాడించాలన్న ఫలితం కనబడటం లేదు. ఎవరో లారీ డ్రైవర్‌లు ఆమెపై అఘాయిత్యం చేసి, ఇక్కడ వదిలి వెళ్లి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఆమె చేతికి కత్తి గాయం ఉండటంతో స్థానికంగా ఉన్న ఒక వ్యక్తి ఆమెకు ఆర్ఎంపీ దగ్గర వైద్యం చేయించాడు. రాత్రి సమయాల్లో చలికి వణుకుతూ, దోమలతో బాధపడుతున్న ఆమెను ఒక రాత్రి, ఒక వ్యక్తి మద్యం తాగి వచ్చి ఆమెను బలాత్కారం చేయబోగా, అరవటంతో కొంతమంది చేరి ఆమెను ఆ రాత్రి ఒక ఇంట్లో పడుకోబెట్టుకున్నట్లు తెలిసింది. చేతిలో చిల్లిగవ్వలేక, భాష రాక, నా అనే వాళ్ళ లేక, ఎక్కడికి వెళ్ళలేక బ్రిడ్జి కింద ఉన్న ఈ మహిళను అధికారులు పరిశీలించి ఆమెను స్వగ్రామానికి చేర్చాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా నృసింహుని తెప్పోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : సీతానగరం ఉండవల్లి బోటు యార్డ్ కరకట్ట వద్ద కృష్ణా నదిపై మాఘ పౌర్ణమి పరిష్కరించుకొని ఆదివారం సాయంత్రం మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వార్ల తెప్పోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారు బోటు యార్డు వద్ద కృష్ణానదిపై తెప్పోత్సవం ప్రారంభమై విజయవాడ దుర్గా ఘాట్ వరకు వెళ్లి తిరిగి బోటు యార్డు వరకు చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర- చీరాల : బాపట్ల, ప్రకాశంజిల్లా ఎస్పీలు వకుల్ జిందాల్, మల్లిక గర్గ్‌లు శాంతి భద్రతలలో రాష్ట్రంలోనే రెండు జిల్లాలను మొదటి స్థానంలో నిలుపుతున్నందుకు అభినందనలు తెలుపుతున్నామని భవిష్యత్‌లో వారిరువురు ఉన్నత స్థాయిలో ఉండాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని తేళ్ల రాంబాబు అన్నారు. ఆదివారం బాపట్ల, ప్రకాశం జిల్లా ఎస్పీల ఆశీస్సులతో ఇపురుపాలెం కాలువ కట్ట మీద పేదలైన యనాది కుటుంబాలకు బియ్యం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

విశాలాంధ్ర- చీరాల : ఆదివారం చీరాలలోని ఎస్ఆర్పీఎం పాఠశాల, ఏఆర్ఎంపాఠశాల మథర్ థెరిస్సా, జిల్లా పరిషత్ కొత్తపేట పాఠశాల, కేంద్రాలలో జరిగిన పోటీ పరీక్షలో 934 మంది విద్యార్థులకు గాను 890 మంది హాజరయ్యారని, 44 మంది గైర్హాజరు అయ్యారని అన్ని పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాధికారి పివిజే రామారావు,బాపట్ల ఉపవిద్యాశాఖాధికారి జి వెంకటేశ్వర్లు పరిశీలించి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని ఎంఈఓ నాగేశ్వరరావు తెలిపారు.

చర్చికి రూ.15వేలు విరాళం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలోని కృపా మినిస్ట్రీస్ చర్చికి రూ. 15వేలు ఆర్థిక సహాయాన్ని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్.జాన్ సైదా ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, గొంటు శ్రీనివాసరెడ్డి, ఎంవి రత్నారెడ్డి, షేక్ అబ్దుల్ రవూఫ్, జమ్ములమడక ఆదిబాబు, మానుకొండ శేషిరెడ్డి తదితరులు ప్గొన్నారు.

బిడ్డలు కోల్పోయిన తల్లికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని గ్రామంలో ఇటీవల తండ్రి చేతిలో హత్యకు గురి కాబడిన ఇద్దరు బిడ్డలు కోల్పోయి అనాథ అయిన మురారి జ్యోతి కుటుంబనికి సంగం డైరి చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతులు మీదగా రూ.25వేలు, పెదకాకాని కాకతీయ యూత్ వారి రూ.25వేలు మొత్తం రూ.50వేలు నరేంద్రకుమార్ గుంటూరు కార్యాలయంలో జ్యోతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పెదకాకాని కాకతీయ యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - నకరికల్లు : మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు తలంటుస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి అమ్మవారు, రామాలయం వద్దనున్న చెంచులక్ష్మి ఆదిలక్ష్మి సమేత లక్ష్మినరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

అన్నదానానికి విరాళం అందజేత

విశాలాంధ్ర - నకరికల్లు : మాఘ పౌర్ణమి సందర్భంగా చెంచులక్ష్మి ఆదిలక్ష్మి సమేత లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయ అన్నదానానికి సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై.వి.ఆంజనేయులు ఆదివారం రూ.50వేలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. సోమవారం జరగనున్న అన్నదాన కార్యక్రమానికి విరాళం అందించినట్లు ఆంజనేయులు తెలియజేశారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీగా రామణారావు

విశాలాంధ్ర-మాచర్ల: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీగా పట్టణానికి చెందిన బృంగా రమణారావు నియమితులయ్యారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిసి కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ బీసీ నాయకుల సదస్సులో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా బీసీలకు చట్టసభలలో ప్రాధాన్యత లభించడం లేదన్నారు. తరాలు మారినా బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడే ఉన్నారని, జనాభా ప్రాతిపదికన పదవులను కేటాయించినప్పుడే వారికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా బిసి లంతా ఏకతాటిపై నడవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రమణ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర సెక్రటరీగా బాధ్యతలు అప్పగించటం సంతోషకరమని, సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం బీసీల కోసం వెన్న ఉద్యమాలు చేసిన కర్పూరపు కోటయ్య మృతి పట్ల మౌనం పాటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ నాగమల్లేశ్వరరావు, కళా మండల రాష్ట్ర కన్వీనర్ ముప్పన వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ జింకల నాగేశ్వర రావు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గొర్రె వెంకటేశ్వర్లు యాదవ్, గురజాల డివిజన్ షేక్ బాదం భాయ్, రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు కొర్రపాటి మల్లికార్జున యాదవ్, భీమవరపు శ్రీనివాసరావు, వడ్డేం గుంట శివగౌడ్, సాయి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు కాంగ్రెస్ పాదయాత్ర

విశాలాంధ్ర-తాడేపల్లి : ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో (చేయి చేయి కలుపు) కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం గ్రామాలలో సాగింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయడంతో పాటు రైతుల వెన్నెముకను విరుస్తుందని విమర్శించారు. ఈ పాదయాత్రలో పఠాన్ సుభాని, వడ్డేశ్వరం పున్నయ్య, సీనియర్ నాయకులు గోలి సాంబశివరావు, సుబ్బారావు, షేక్ బాజీ, జెల్స్, సుభాని, బాజీ, గఫూర్, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యోన్నతి స్క్రీనింగ్ స్కాలర్ షిప్ పరీక్ష

విశాలాంధ్ర-జెపంగులూరు : గంగవరం విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆబ్జెక్టివ్ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష, మండల కేంద్రమైన పంగులూరులో జరిగింది. ఈ పరీక్ష మాజీ సర్పంచ్ దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ హెచ్ఎం బోడెంపూడి రామ్మూర్తి జ్ఞాపకార్థం నిర్వహించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు నారాయణ తెలిపారు. ఈ పరీక్షను పంగులూరు హైస్కూల్లో మరియు ఇంకొల్లు బాలికల హైస్కూల్లో, అద్దంకి బాలుర హై స్కూల్‌లో నిర్వహించామని తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 333 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, అందులో 316 మంది విద్యార్థులు పరీక్ష హాజరయ్యారని తెలిపారు. మండల వారీగా ర్యాంక్ సాధించిన మొదటి 15 మంది విద్యార్థులకు, మండలానికి ఐదు మంది చొప్పున 3 మండలాలకు కలిపి 15 మంది విద్యార్థులకు, ఒక్కొక్కరికి సంవత్సరానికి 10,000 రూపాయలను, రెండు సంవత్సరాలు స్కాలర్షిప్ గా అందిస్తామని తెలిపారు. 15 మంది విద్యార్థులకు ఇంటర్ లేదా సత్సమానమైన కోర్సులలో చేరిన వారికి, ఒక్కో సంవత్సరానికి 10, 000 రూపాయాల చొప్పున, రెండు సంవత్సరాలకి 20,000 రూపాయలు అందిస్తామని తెలిపారు. 15 మందికి విద్యార్థులకు రెండు సంవత్సరాలకి మొత్తం మూడు లక్షల రూపాయలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను మెరుగైన విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి స్కాలర్షిప్లు ఇస్తున్నట్టు తెలిపారు. పంగులూరు హైస్కూల్లో జరిగిన పరీక్షలో పంగులూరు నుంచి 15 మంది, ముప్పవరం నుంచి 9 మంది, అలవలపాడు నుంచి 14 మంది, బూదవాడ నుంచి 20 మంది, చందలూరు నుంచి 21 మంది విద్యార్థులు హాజరయ్యారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నాలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు, రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీలు పిలుపునిచ్చారు. నిజాంపట్నం మండలం కళిఫలంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి మొదటి విడతగా 15 లక్షలు, రెండవ విడత 15 లక్షల గృహాలను ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి హామీలను విస్మరించి పేదలను మోసం చేశారని వారు ఆరోపించారు. నేడు ప్రభుత్వం రూ. 1.80 లక్షలు ఇచ్చి లబ్ధిదారులే ఇంటిని నిర్మించుకోవాలని వత్తిడి చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని లేకుంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ధర్నాలో లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాగాంజనేయులు, బాలాజీలు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు సత్యం, వేదాంతం దుర్గమ్మ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారునికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరుతూ సోమవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించి తలపెట్టిన ధర్నాలో లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలని వేమూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి పక్క గృహాలు నిర్మిస్తామని చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ. 1.80 లక్షలు ఏమాత్రం సరిపోవటం లేదని ఈ కారణంగా లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని లేదా ప్రభుత్వమే పక్కా గృహాన్ని నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో లబ్ధిదారుడు ఇల్లు నిర్మించకపోతే ఇచ్చిన భూమిని వెనక్కి తీసుకుంటామంటూ లబ్ధిదారులను బెదిరించడం అన్యాయం అన్నారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలంటూ జరిగే ఈ ధర్నాలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాసరావు కోరారు

దిండి సముద్రతీరంలో పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని అడవులదీవి గ్రామంలోని శ్రీ భ్రమరీ బాలా త్రిపుర సుందరి సహిత శ్రీ మల్లికార్జున స్వామి తిరునాళ్లు అత్యంత వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా ఆదివారం దిండి పరిశా వారిపాలెం బీచ్‌లో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. సముద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు. సముద్ర స్నానాలు చేసేందుకు పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

ఘనంగా రుద్రాభిషేకం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని కొండాయ పాలెం గ్రామంలో వెంచేసిఉన్న గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామికి ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ఘనంగా రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో హిమాలయ నాగ సాధువుల సాంప్రదాయ ప్రకారం జ్ఞాన ప్రసన్న గిరి స్వామి శిష్య బృందంచే ఈ రుద్రాభిషేకం కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. మూడు అడుగుల మట్టి శివలింగానికి పంచాక్షరి మంత్రం పారాయణం కొనసాగుతుండగా, హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల నోటి నుండి జాలవారుతుండగా, మహా రుద్రాభిషేకం నయనానందకరంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుండి వేద పండితులు స్వర్ణ దీపక్ శర్మ ఆధ్వర్యంలో ఇంకొల్లు సుధీర్ శర్మ,కారంచేటి శ్రీనివాస్ శర్మ,సతీష్ శర్మ,వల్లినాడ్ శర్మలు గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం 1108 ఏకశిలా పాలరాయి శివలింగాలకు పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రాభిషేకం,అన్నదాన కార్య క్రమాల్లో తమ వంతు భూమికను పోషించారు.చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహా రుద్రాభిషేకాన్ని కనులారా తిలకించారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణ పరిధిలోని మూడో వార్డులో నిర్మిస్తున్న జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ మాట్లాడుతూ లబ్ధిదారులు తక్షణమే ఇంటి నిర్మాణం చేపట్టకపోతే రద్దు చేస్తామని అధికారులు భయ పెడుతున్నారని అన్నారు. మౌలిక సదుపాలైన రోడ్లు, కరెంటు, నీళ్ల లేకుండా లబ్ధిదారులు ఏలా ఇళ్ళు కట్టుకుంటారో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు ఇల్లు కట్టిస్తామని లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేశారని, ఇళ్ళు రద్దు చేస్తారని భయంతో కొందరు పది రూపాయలు వడ్డీలకు అప్పులు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి గుండాల హర్ష, యు రాజు, సుభాని, నాగూరు, వలి, కోటి తదితరులు పాల్గొన్నారు.